# అనేకత్వములోని ఏకత్వమనే ఆత్మతత్త్వమును గుర్తింపజేయునదే ఆధ్యాత్మికము

బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం
ద్వంద్వాతీతం గగనసదృశం తత్త్వమస్యాదిలక్ష్యమ్
ఏకం నిత్యం విమలమచలం సర్వధీసాక్షిభూతం
భావాతీతం త్రిగుణరహితం సద్గురుం ....

ప్రేమస్వరూపులారా!

భగవత్ తత్త్వం గుర్తించటం అంత సులభమైన మార్గంకాదు. 'నేను' అనే అహంకారం, 'నాది' అనే అభిమానమే సమస్త అనర్థములకు మూలకారణం. 'నేను' అనే అహంకారం, 'నాది' అనే మమకారం ఏనాడు మానవుడు త్యజించునో ఆనాడే దైవత్వం అత్యంత సులభంగా లభిస్తుంది. ఆత్మ సర్వాంతర్యామి, అనంతమైనటువంటిది. ఆత్మ ఒక్కటే కాని ఉపాధి భేదములవల్ల యిది వివిధరూపములతో మనకు కన్పించుచున్నది. అనేకత్వములోని ఏకత్వమనే ఆత్మతత్త్వమును గుర్తింపచేయునదే ఆధ్యాత్మికము.

## బ్రహ్మానందమే నిజమైన గురువు

దురదృష్టవశాత్తు యీనాడు ఏకత్వమును అనేకత్వముగా విభజించే మేధావులు అభివృద్ధి అవుతున్నారే కాని, అనేకత్వములోని ఏకత్వాన్ని గుర్తించే వ్యక్తులు చాలా తక్కువగా ఉంటున్నారు. ఒక భవనం నిర్మించుకున్నాము. ఇందులో ఒక స్నానాలగది, ఒక వంటగది, ఒకటి భోజనం చేసేగది, ఒకటి నివసించేగది యీ విధంగా అనేక విధాల భాగములుగా విభజించుకున్నాము. ఈ విభాగములకు కారణమేమిటి? గోడలే! ఈ గోడలు తీసివేసినపుడు అంతా ఒకే భవనంగా కనిపిస్తుంది. మధ్యలో గోడలు అడ్డుగా వుండటంచేతనే యీ

sri sathyasai vahamrutam

భవనమునందు వివిధ రూపములతో కూడినటువంటి, నామములతో చేరిన గదులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా ఆత్మ అనే భవనం ఒక్కటే! ఇందులో శరీరము, యింద్రియములు, మనసు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే గదులను మనం ఏర్పరుచుకోవటముచేత, ఉపాధులను నిర్మించుకోవటంచేత, యివి భిన్నముగా మనకు కన్పించుచున్నవి. ఇట్టి భిన్నత్వముతో కూడిన మానవత్వము యీనాడు అభివృద్ధి కావడంవల్ల గురుత్వము అనేది అత్యవసరమయిపోయింది. ఏమిటి యీ గురుత్వమనగా? ఎవరు యీ గురువు? ఈ గురుత్వములో ఉన్న నిజతత్త్వం ఏమిటి? ఈ గురుత్వములో ఉన్న సత్యస్వరూపమేమిటి? ఎవరు గురువు? కేవలం భౌతికవిద్యలు నేర్పేటువంటివాడు గురువా? భౌతికమైన వస్తువులు విభజింపజేసేవాడు గురువా? జగత్ సంబంధమైన పదార్థముయొక్క విజ్ఞానాన్ని విపులంగా విశదీకరింపచేసేవాడు గురువా? కాదు కాదు. వీరందరూ అధ్యాపకులే! నిజమైన గురువు బ్రహ్మానందం. ఈ బ్రహ్మానందం అంటే ఏమిటి? ఈ బ్రహ్మానందం అనేదే నిజమైన గురువు.

**నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకికములకు అతీతమైన ఆనందమే బ్రహ్మానందము**

ఎవరు యీ బ్రహ్మానందం? ఇతనియొక్క రూపమేమిటి? ఇతనెక్కడ ఉంటాడు? అని విచారణ చేయగా బ్రహ్మానందమునకు, సాటియైన ఆనందం మరొకటి కానరాదు. జగత్తునందు కల సమస్త ఆనందములుకూడా బ్రహ్మానందంలో విలీనమై ఉంటున్నవి. సమస్త ఆనందములుకూడా అంతర్గతమై ఉంటూ ఇవి యీ బ్రహ్మానందములో లీనమైతే ఇక ఈ బ్రహ్మానందం ఎక్కడున్నది? హాయిగా, శాంతిగా, పుష్టిగా, సంతుష్టిగా ఉండినపుడు మానవుడు పడే ఆనందం ఎట్టి ఆనందము? ధనకనకవస్తువాహనములతో భోగభాగ్యములను అనుభవించే సమయంలో మానవుడు పొందే ఆనందము ఎట్టి ఆనందము? దీనిని కేవలం 'మానవానందము' అన్నారు. 'మనుష్యానందం' అన్నారు. ఈ మనుష్యానందముకంటే నూరురెట్లు అధికమైనటువంటిది, ఇంద్రియానందము అన్నారు. ఈ యింద్రియానందముకంటే నూరురెట్లు అధికమైనది 'దేవేంద్రానందము' అన్నారు. దీనికంటే నూరురెట్లు అధికమైన ఆనందమును 'దేవానందము' అన్నారు. దీనికంటే

srisathyasaivachanamrutam

నూరురెట్లు అధికమైన దానిని 'బృహస్పతి ఆనందమ'న్నారు. ఈ ఆనందముకంటే నూరురెట్లు అధికమైనదానిని 'ప్రజాపతి ఆనందము' అన్నారు. ఈ ప్రజాపతి ఆనందమునకంటే నూరురెట్లు అధికమైన ఆనందమే బ్రహ్మానందము.' బ్రహ్మానందవల్లియే దీనికి సరియైన కొలతబద్ద. ఇట్టి మానవునికి ఉహాతీతమైన ఆనందమును నిత్యజీవితములో మనము 'బ్రహ్మానందం,' 'బ్రహ్మానందం' అని ఉపయోగపెట్టుకుంటున్నాము. 'నా కుమార్తె వివాహం బ్రహ్మానందంగా జరిగింది' అంటారు. 'నా కుమారుడు పరీక్షలో బ్రహ్మానందముగా రిజల్టు తెచ్చుకున్నాడు. నా కుమారుడు విదేశములలో బ్రహ్మానందంగా ఉంటున్నాడు.' అని చెపుతుంటారు. ఏమిటి యీ బ్రహ్మానందమంటే? ఇది అంత సులభమైనటువంటిదా? అంత చిన్నదైనటువంటిదా? లోకసంబంధమైనటువంటిదా? భోగభాగ్యములతో కూడినటువంటిదా? భౌతికమైనటువంటిదా? కాదు కాదు. నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, లౌకికములకు అతీతమైనటువంటిదే యీ బ్రహ్మానందము. అట్టి ఆనందమును అనుభవించేవాడే నిజమైన గురువు. అతను ఎవరు? ఒక్క భగవంతుడు తప్ప మరొకరికిట్టి ఆనందమును అనుభవించే అధికారం లేదు. ఈ ఆనందమునందే సమస్త ఆనందము యిమిడి ఉంటున్నది.

**రాకపోకలు లేనటువంటిదే పరమసుఖము**

ఇంక రెండవవాడు ఎవడు? 'పరమసుఖము!' ఏమిటి యీ పరమసుఖము? జగత్తునందుగల సుఖములకంటేకూడా యీ పరమసుఖము అత్యున్నతమైనటువంటిది. ఇది భౌతికమైన సుఖము కాదు. భౌతికమైన సుఖములు ఒక పర్యాయం ఉండి, మరియొక పర్యాయములో అంత్యమవుతున్నవి. భౌతికసుఖములు మార్పు చెందుతున్నవి. రావటం, పోవటం జరుగుతున్నది. రాకపోకలు లేనటువంటిదే పరమ సుఖము. భౌతికసుఖములు అన్నీ కేవలం బుద్బుదప్రాయములు. నీటి బుడగలవంటివి. ఈ నీటిబుడగలు ఏ క్షణంలో శిధిలమైపోతాయో? మార్పు చెందేటువంటి సుఖము నిజమైన సుఖము కాదు. ఈ ప్రపంచమునందు మానవుడు అనుభవించేటువంటి సమస్త సుఖములు ఒక కాలములో, ఒక దేశములో మార్పు చెందుతూ వుంటాయి. కనుక అట్టి మార్పు చెందని పరమ

sri sathyasai vahanamrutam

సుఖమును అనుభవించేవాడే నిజమైన గురువు.

**దేశకాల పరిస్థితులకు అతీతుడైన భగవంతుడే కేవల జ్ఞానమూర్తి**

మూడవది 'కేవలం జ్ఞానమూర్తిం.' కేవలమనగా ఏమిటి? దేశకాలములకు అతీతమైనవాడు. ప్రపంచమునందుకల సమస్త పదార్థములుకూడా దేశకాలములతో కట్టుబడినటువంటివి. దేశకాలములకు అతీతమై తనకంటే అధికమైనది మరొకటి జగత్తులో లేకపోవటంచేతనే యితనిని 'కేవలం' అని పిలిచారు. అట్టి దేశకాలపరిస్థితుల ప్రభావమునకు అతీతమైన వ్యక్తియే మూడవ గురువు. అతనే భగవంతుడు. జ్ఞానం అంటే? ఏమిటి యీ జ్ఞానం? భౌతికజ్ఞానమా? పదార్థజ్ఞానమా? లేక రసాయనజ్ఞానమా? లేక ఏ జ్ఞానం యిది? వైజ్ఞానమా? కాదు కాదు. ఈ జ్ఞానములు అన్నీకూడను పదార్థములచేత నిర్మింపబడేవి. జగత్తునందుకల సమస్త పదార్థములయొక్క పరిణామమును గుర్తింపచేసేటువంటిది భౌతిక జ్ఞానం. సమస్త జ్ఞానములకు మూలాధారమై, సర్వజ్ఞానములకు అతీతమై, అనంతమై, అవ్యక్తమై, గుప్తమై ఏకత్వంగా ఉండేటువంటిదే జ్ఞానం. అనగా 'అద్వైతదర్శనం జ్ఞానం.' సమస్తమూ ఒక్కటే, ఒక్కటే, ఒక్కటే. రెండవ పదార్థమే జగత్తునందు లేదు. ఒకవేళ ఉన్నదా యీ పదార్థంయొక్క Reaction, Reflection, Resound కాని, రెండవది కాదది. నిజమైన జ్ఞానమనగా స్వస్వరూప సందర్శనమే! తనను తాను తెలుసుకోటమే నిజమైన జ్ఞానము. తనను తాను తెలుసుకోటానికి ప్రయత్నించే మానవుడు ఏ ప్రదేశమునకు వెడతాడు? ఏ గురువును ఆశ్రయిస్తాడు? అయ్యో! నేను ఎక్కడ ఉన్నానని అడుగుతున్నాడంటే వాడు నిజమైన జ్ఞాని కాదు, అజ్ఞాని. తనను తాను ఎవ్వడూ బయట ప్రపంచములో వెతకటానికి ప్రయత్నించడు. ఈనాడు అట్టి మానవులుగా తయారు కావటంచేతనే అజ్ఞానులుగా ఉంటున్నారు. తనను తాను గుర్తింపచేసుకునేవాడే జ్ఞాని. తన తత్వాన్ని తాను గుర్తింప చేసుకున్నవాడు భగవంతుడు తప్ప మరొకడు లేదు. కనుక భగవంతుడే జ్ఞానస్వరూపుడు. అతను సత్యస్వరూపుడు. అతను అనంతస్వరూపుడు. అందువలననే 'సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ' అన్నారు. ఇదే 'కేవలం జ్ఞానమూర్తిం.'

srisathyasaivachanamrutam

**శీతోష్ణములు, సుఖదుఃఖములు, లాభనష్టములు, నిందాస్తుతులువంటి ద్వంద్వములకు అతీతుడైనవాడు భగవంతుడొక్కడే!**

'ద్వంద్వాతీతం.' ఏమిటి యీ ద్వంద్వము? శీతోష్ణములకు అతీతము. సుఖదుఃఖములకు అతీతము. లాభనష్టములకు అతీతము. నిందాస్తుతులకు అతీతము. యిట్టి అతీతమైన తత్వము ఏమిటిది? అది ఒక్క భగవంతునికి తప్ప అన్యులకు యీ అధికారములేదు. కనుకనే 'ద్వంద్వాతీతం.' అతనే నిజమైన గురువు.

**గగనమువలె సర్వత్ర వ్యాపించినవాడు భగవంతుడు**

'గగన సదృశం!' గగనము ఎక్కడ ఉంది? సర్వత్రా వ్యాపించి ఉంటున్నది. ఎక్కడ చూచినా గగనము ఉంటున్నాది. గగనమనగా ఆకాశమని కాదు. ఆకాశమనగా ఏమిటి? 'ఆకాశం గగనం శూన్యం.' కనుపించేది కాదది. పైన చూచి యిది ఆకాశము అనుకుంటున్నాము. అది ఆకాశము కాదు. ఆకాశమునకు అవకాశము కల్పించినటువంటిది. యిది మేఘములయొక్క సమ్మిళితస్వరూపము. దీనిని మనం ఆకాశము అనుకుంటున్నాం. యిది ఆకాశమే కాదు. సర్వత్ర ఉంటున్నది ఆకాశము. ఎక్కడ చూపటానికి వీలవుతుంది? తప్పక యిక్కడ ఉంది ఆకాశము. యిక్కడ వుంది ఆకాశము (స్వామి చిటిక వేస్తూ). నేను మాట్లాడే దాంట్లో ఉంది ఆకాశము. ఈ ఆకాశమునకు గుణము ఏమిటి? శబ్దమే ఆకాశముయొక్క గుణము. కాబట్టి శబ్దము ఎక్కడ ఉంటున్నదో అక్కడంతా ఆకాశమే! ఉచ్ఛ్వాసనిశ్వాసములుకూడను శబ్దము. కనుక ఆకాశములేని స్థానమెక్కడ? 'అంతర్బహిశ్చ తత్ సర్వంవ్యాప్య నారాయణ స్థితః'. యిట్టి ఆకాశము ఏ విధముగా వ్యాపించి ఉన్నదో దానికంటె అమితంగా వ్యాపించినవాడు, 'గగనసదృశం.' అతనే భగవంతుడు. దీనినే

> **శబ్ద బ్రహ్మమయీ చరాచరమయీ జ్యోతిర్మయీ వాఙ్మయీ**
> **నిత్యానందమయీ పరాత్పరమయీ మాయామయీ శ్రీమయీ.**

యిదంతా ఆకాశముయొక్క గుణములే! కనుక యీ విధముగా సర్వత్ర వ్యాపించినవాడు. ఆ వ్యాపించినవాడు ఎవడు? అతనే భగవంతుడు. కనుక అతనే నిజమైన గురువు.

sri sathyasaivachanamrutam

**'ప్రజ్ఞానం బ్రహ్మ,' 'అహం బ్రహ్మాస్మి,' 'తత్త్వమసి,' 'అయమాత్మా బ్రహ్మ' అనే నాలుగు మహావాక్యముల సారము మూర్తీభవించినవాడే గురువు**

'తత్త్వమస్యాది లక్ష్యం.' యీ తత్త్వములంటే ఏమిటి? చతుర్విధములైన మహా వాక్యములుంటున్నాయి. ఒకటి 'ప్రజ్ఞానం బ్రహ్మ.' యిది ఋగ్వేదమునుండి వచ్చినది. ఋగ్వేదసారమిది. 'అహం బ్రహ్మాస్మి' యిది యజుర్వేదముయొక్క సారము. 'తత్త్వమసి' యిది సామవేదముయొక్క సారము. 'అయమాత్మ బ్రహ్మ' యిది అథర్వణవేదముయొక్క సారము. ఈ విధంగా ఉపనిషత్తులు నాలుగు వేదముల సారమును నాలుగు మహావాక్యములలో విభజించినవి. ఈ నాలుగు మహా వాక్యములు ఒకే దివ్యత్వమును నిరూపిస్తూ వచ్చాయి. మార్గములు వేరు వేరుగా చూపుతూ గమ్యమును మాత్రం ఒక్కటిగానే ఏర్పరిచినాయి. మొట్టమొదటిది 'ప్రజ్ఞానం బ్రహ్మ.' యీ ప్రజ్ఞ అనగా ఏమిటి? 'వీడు చాలా ప్రజ్ఞాశాలిరా!' అంటుంటాం. ఈనాడు తెలివితేటలకు ప్రజ్ఞ అంటున్నాము మనము. కాదు, కాదు. యిదికాదు ప్రజ్ఞ. యీ ప్రజ్ఞ అనేది ఎక్కడ ఉంటాది? శరీరమునందు, యింద్రియములందు, మనస్సునందు, బుద్ధినందు, అంతఃకరణయందు, అహంకారమునందు సర్వత్ర ఉంటున్నాది, యీ ప్రజ్ఞ. ప్రజ్ఞ అనేది సర్వప్రాణులందు, సర్వజీవులందు చరఅచరములందు ఉంటున్నది. దీనినే Constant Integrated Awareness అన్నారు. Awareness అంటే ఏమిటి? తెలుసుకోటము. ఏమిటి తెలుసుకోటము? యింతా యింతా తెలుసుకోటమా? కాదు కాదు అంతా తెలుసుకోటం.

> **పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే**
> **పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.**

పూర్ణముగా తెలుసుకోవాలి. చరాచరములందు ఉన్నటువంటి తత్త్వమును గుర్తించటం. ఈ 'ప్రజ్ఞానం బ్రహ్మ'లో ప్రజ్ఞ, బ్రహ్మ రెండు సమమైన పదములే! ప్రజ్ఞానమే బ్రహ్మ అని కొంతమంది పండితులు వ్యాఖ్యానము చేస్తారు. ఈ ప్రజ్ఞానము, బ్రహ్మ వేరు వేరు కాదు. బ్రహ్మ అనగా ఏమిటి? సర్వత్ర వ్యాపించినవాడు. బ్రహ్మతత్త్వము సమస్త స్వరూపకముగా ప్రచార ప్రబోధలు సల్పినటువంటి ద్వయత్వమునకే 'బ్రహ్మ' అని పేరు. ఈ ప్రపంచమంతయు

srisathyasaivachanamrutam

బ్రహ్మస్వరూపమే! ఈ బ్రహ్మస్వరూపమైన ప్రపంచమునందు సర్వత్రా వుండినది బ్రహ్మతత్త్వమే. సులభంగా మనం అర్థము చేసుకోవలెనన్న 'బ్రహ్మ అనగా వ్యాపకత్వమే!' ఎక్కడ చూచినా వ్యాపించిపోతున్నాది. కనుక భగవంతుడనగా ఏమిటి? సర్వవ్యాపకుడే భగవంతుడని ఋగ్వేదము చక్కగా నిరూపణ చేసింది. కనుక యిట్టి సర్వవ్యాపకత్వము కల్గినవాడే మొదటి గురువు. రెండవది 'అహం బ్రహ్మాస్మి.' 'అహం' అనగా ఏమిటి? 'అహం' అనగా 'నేను' అనుకుంటున్నారు. కాదు, కాదు. దీనికి మరొక అర్థము కూడా ఉంటున్నాది. సాక్షి. ఆ సాక్షీభూతుడైన వాడు సర్వమునకు సాక్షీభూతుడు. అతనే ఆత్మ. యీ 'అహం' అనేదే ఆత్మస్వరూపకంగా ఉంటున్నాది. సర్వత్రా వ్యాపించిన చైతన్యమే మానవునియందు ఆత్మస్వరూపకంగా ఉంటున్నది. ఆత్మచైతన్యము, బ్రహ్మ వేరు కాదు. యిది ఏమిటి? వస్త్రము. యీ వస్త్రమునకు ఆధారము దారము; దారమునకు ఆధారము ప్రత్తి. కాబట్టి ప్రత్తి, దారము, వస్త్రము మూడు ఒక్కటైనట్లుగా వివిధ సమయములందు, వివిధ కాలములందు, వివిధ పరిస్థితులయందు 'ఆత్మ,' 'బహ్మ,' 'అహం' అనే పేర్లు ధరిస్తుంటాది. యీ మూడింటియొక్క ఏకత్వమే ఆహం, బ్రహ్మ, అస్మి. అస్మి అనగా కలవటం. 'నేను' అనే సాక్షీభూతుడు సర్వవ్యాపకమైన సాక్షీభూతుడు ఒక్కటే అనేదే 'అహం బ్రహ్మాస్మి.' మూడవది 'తత్ త్వం అసి.' యిది సామవేదమునందుండిన సారము. 'తత్,' అది, 'త్వం,' యిది, 'అసి' ఒక్కటి. నేను, నీవు, వేరు వేరుగా ఉండినప్పుడు నీవు నీవే, నేను నేనే! నీవు నేను రెండు కూడినప్పుడు 'మనం' అయిపోతుంది. కనుక రెండు ఒక్కటే! ఉపాధిని ధరించినప్పుడు 'త్వం' అనుకుంటున్నాము. ఉపాధి రహితమైనప్పుడు 'తత్' అయిపోతున్నాది. కనుక, ఉపాధి రహితమే 'తత్;' ఉపాధి సహితమే 'త్వం.' ఉపాధి సహితుడే జీవుడు. ఉపాధి రహితుడే దేవుడు. కనుక 'దేవుడు, జీవుడు ఒక్కడే' అనేదే సామవేదము చక్కగా విశదీకరించి చెప్పుతూ వచ్చింది. 'అయమాత్మ బ్రహ్మ.' నాలుగవ మహావాక్యము. యిక్కడ చక్కగ మీరు విచారణ చేయాలి. I am Sai Baba. అయం ఆత్మ. I am Atma and Brahma. రెండు కాదు యిక్కడ ఉండేది. అయం, ఆత్మ, బ్రహ్మ అనగా, the one you think you are, the one others think you are and the one you really are. నీకు దేహము ఉంది, మనసు ఉంది, ఆత్మ ఉంది, యీ మూడూ చేరి ఒక్కటే! శరీరముతో పనులు చేస్తున్నాం. మనసుతో విచారణ సలుపుతున్నాము. ఈ రెండింటిని

sri sathyasai vahini vachanamrutam

సాక్షిభూతముగా చూస్తున్నావు నీవే! జాగ్రతలో విశ్వుడు నీవే; స్వప్నములో తైజసుడు నీవే; సుషుప్తిలో నీవే ప్రాజ్ఞుడు. ప్రాజ్ఞుడనగా ఏమిటి? అదే ప్రజ్ఞానం బ్రహ్మ. ఆత్మతత్త్వమే ప్రజ్ఞ. కనుక యీ నాలుగు వాక్యములయొక్క ఏకత్వంలో కూడిన ఏ శక్తి ఉన్నదో అదే నిజమైన గురువు. 'ప్రజ్ఞానం బ్రహ్మ,' 'అహం బ్రహ్మాస్మి,' 'తత్ త్వం అసి,' 'అయమాత్మ బ్రహ్మ' యీ నాలుగు మహావాక్యముల సారము మూర్తీభవించినవాడే గురువు. అతడే 'తత్త్వమస్యాది లక్ష్యం.'

## భగవంతుడొక్కడే 'ఏకం'

'ఏకం'-ఏకమేవా అద్వితీయం బ్రహ్మ. ఒక్కటే ఒక్కటి ఉన్నది. యిది పుట్టక పూర్వము, మరణించిన తరువాత జీవితములో ఎప్పుడుకూడను ఉండినది. ఒక్కటే, మారేది కాదు. అనగా భగవంతుడు ఒక్కడే 'ఏకం'. యింక ఎవ్వరూ 'ఏకం' కాదు. మిగిలినవన్నీ అనేకముతో కూడినవి. అనగా అనేకత్వము ఏకత్వములోనే ఉన్నదని గుర్తించినవాడే గురువు. యిది ఎట్లా? ఏకత్వములో అనేకత్వము ఎట్లా ఉంటున్నాది? ఒక మట్టి విత్తనము ఉంటున్నాది. ఈ మట్టి విత్తనము ఏకంగానే ఉంటున్నాది. కానీ ఆ విత్తనమునందే పెద్ద వృక్షము ఉంటున్నాది. ఆ వృక్షములోనే అనేక శాఖలుంటున్నాయి. శాఖలలో అనేక ఉపశాఖలుంటున్నాయి. దానిలోనే పువ్వులుంటున్నాయి. దానిలోనే కాయలుంటున్నాయి. దానిలోనే వేర్లు వుంటున్నాయి. అన్నీ దానిలోనే ఉంటున్నాయి. చూశారా! వేర్లు వేరు, కొమ్మలు వేరు, పువ్వులు వేరు, ఆకులు వేరు, కాయలు వేరు; కాని యింత పెద్ద వృక్షమంతా ఒక్క విత్తనములోనే యిమిడి ఉంది. 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి.' ఉన్నది ఒక్కటైనప్పటికిని ఒకరు కొమ్మలంటున్నారు. ఒకడు ఆకులంటున్నారు. ఒకరు కాయలంటున్నారు. ఒకరు పువ్వులంటున్నారు. ఏకం ఒక్కటే! ఆ ఒక్కటైనటువంటి వాడే నిజమైన గురువు. ఆ గురువు ఎవరు? భగవంతుడే!

## భగవంతుడు ఆద్యంతములు లేనివాడు, ఎల్లప్పుడూ ఉండేవాడు మరియు మార్పు చెందనివాడు

'నిత్యం.' ఎప్పుడూ మారనటువంటి వాడు నిత్యుడు. ఎట్టి పరిస్థితులందు అతను మార్పు చెందడు. ఇప్పుడు సూర్యచంద్రాదులు మార్పుచెందుతున్నారు. వారు కదులుతున్నారు.

sri sathyasaivachanamrutam

అన్నీ కదలినప్పటికిని తాను కదిలేటువంటివాడు కాడు, భగవంతుడు. నిత్యుడై మార్పు చెందనివాడు. మానవులలో పుట్టినప్పుడు బిడ్డ, పదేండ్లకు బాలుడు. 30 సంవత్సరములకు యువకుడు. 75 సంవత్సరములకు వృద్ధుడు. అంతా మార్పు చెందునవే! కానీ ఆద్యంతములు లేనివాడు, మార్పు చెందనివాడు, ఎల్లప్పుడు ఉండేవాడు భగవంతుడొక్కడే! ఆయనకు అంత్యమే లేదు, పుట్టుకే లేదు. పుట్టుక లేనప్పుడు యింక అంత్యము ఎక్కడ ఉంది? ఆ నిత్యుడే గురువు.

**భగవంతుడు ఎట్టి మాలిన్యములు లేనివాడు, పరిశుద్ధమైనవాడు, పవిత్రమైనవాడు**

'విమలం' విమలమనగా ఎట్టి మాలిన్యములు లేనివాడు. పరిశుద్ధమైనవాడు, పవిత్రమైనవాడు. ఎట్టి లోకసంబంధమైనవిగాని, యింకే విధమైనవిగాని మాలిన్యములు చేర్చుకున్నవాడు కాడు. ఏది అతనిని చేరినప్పటికిని అన్నీ భస్మమే! అగ్నిలో యేమి వేసినా మంచి వేయి, చెడ్డ వేయి అన్నీ భస్మమే చేస్తుంది. అది ఎప్పుడు పరిశుద్ధముగానే ఉంటుంది. శవాన్ని కాల్చు, కట్టెలను కాల్చు, యినుమును కాల్చు, బంగారమును కాల్చు-అగ్ని అగ్నిగానే పవిత్రముగా ఉంటుంది. కనుకనే అతనిని 'విమలం' అన్నారు. అట్టి నిర్మలమైనవాడు, పరిశుద్ధమైనవాడు ఎవరు? అతనే గురువు.

**అంతా తానే ఐయుండి నిశ్చలంగా వుండేవాడు, భగవంతుడు**

'అచలము.' చాలా మార్పు చెందుతుంటాయి. భూమి ఎన్నో పర్యాయములు తిరుగుతూ ఉంటుంది. తన చుట్టూ తాను తిరగటమే కాకుండా సూర్యుని చుట్టూ 66 వేల మైళ్ళ వేగముతో తిరుగుతూ ఉంటుంది. కాని ఎంత తిరుగుతున్నప్పటికి మనకు కనుపించటం లేదు. భూమి స్థిరముగా ఉందని మనము అనుకుంటున్నాము. కాదు, కాదు; భూమి తిరుగుతున్నాది. చంద్రుడు తిరుగుతున్నాడు. ఈ సినిమా పిక్చరు సెకండుకు 16 పిక్చర్సు తిరుగుతూ వుంటాయి. కానీ అతను నిశ్చలం. తిరిగేవాడు కాదు. అంతా తనయందే వుంటున్నాది. అంతటా తానే ఉన్నాడు. తిరిగేది ఎక్కడ? అక్కడకు పోవాలంటే యిక్కడనుంచి అక్కడకు కదలాలి. అక్కడా ఉన్నాడు, యిక్కడా ఉన్నాడు. 'యిక్కడ, అక్కడ, ఎక్కడ చూచినా ఆ ఒక్కడే ఆత్మలో మక్కువై ఉన్నాడు' అని. కనుక, 'నిశ్చలం,' 'నిర్మలం.'

sri sathyasai vachanamrutam

## మంచి, చెడులకు; పరిస్థితులకు కేవలం సాక్షీభూతునిగా ఉంటాడు భగవంతుడు

యిలాంటి భగవత్ తత్త్వములోపల 'సర్వధీ సాక్షీభూతం.' అన్నింటికీ తానే సాక్షి. ఎవరు మంచి కార్యము చేసినా ఎవరు చెడ్డ కార్యము చేసినా, ఏ విధమైన పరిస్థితిలో ఉండినా తాను కేవలం సాక్షీభూతునిగా ఉంటాడు. ఒక డ్రామా వేస్తూ ఉంటాము. స్టేజిపైన రాజు మంచి ఠీవిగా మాట్లాడుతున్నాడు. మంత్రి దానిని బోధపరుస్తున్నాడు. జవాను దండం పట్టుకొని నిల్చున్నాడు. ఎవరెవరు ఏఏ మాటలు మాట్లాడుతున్నప్పటికిని ఆ స్టేజీమీద లైటుకు వీని మాటలు, వాని మాటలతో యేమీ సంబంధము లేదు. లైటును యివ్వటమే దాని పని. హరిశ్చంద్రుడు బాధపడుతున్నాడు. చంద్రమతి ఏడుస్తున్నది. లోహితాస్యుడు పాము కరచి చచ్చిపోయాడు. యీమె ఏడ్చినా, అతను చచ్చినా, ఇంకొకరు బాధపడినా లైటు మాత్రం ఒక్కటిగానే కాంతిని వెదజల్లుతూ ఉంటున్నది. కళాకారులు మాత్రమే మార్పులు చెందుతూ ఉంటారు గానీ, యిది సాక్షీభూతము. ఏమాత్రము మార్పు ఉండదు. అతనే నిజమైన గురువు.

## మనస్సుకు, వాక్కుకు అతీతమైనవాడు, భావములకు అతీతమైనవాడు భగవంతుడు

'భావాతీతం.' 'యథో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ.' యితను 'యిట్టివాడు, అట్టి వాడు' అని ఎవ్వరూ చెప్పటానికి వీలు కాదు. భావానికి అతీతమైనవాడు. భావము ఉంటే కదా మంచిచెడ్డలు చెప్పాలి. భావమునకు అతీతమైనవానిని గురించి ఏ రీతిగా చెప్పగలరు? కనుక యితను నిజమైన గురువు.

## సత్త్వరజస్తమో గుణములనే త్రిగుణములకు అతీతమైనవాడు భగవంతుడు

త్రిగుణరహితం. సత్త్వరజోతమో గుణములు. ఈ సత్త్వరజోతమో గుణములు ప్రకృతియొక్క లక్షణములు. ఈ మూడు లక్షణములు ఉండినప్పుడే సుఖము, దుఃఖము ఉంటుంటాది. ఈ మూడు లక్షణాలు లేకపోతే యే సుఖము లేదు, ఏ దుఃఖము లేదు. ఈ మూడు గుణములే సర్వ అవలక్షణములకు కారణము. వీటివలన మనం అనేక దుఃఖములను పొందుతున్నాము. ఈ మూడు గుణములకు అతీతమైనవాడు ఎవడు? అతడే భగవంతుడు. అతనే గురువు. ఈ గురువు అంటే ఎవరు? అనేకమంది చెబుతూ ఉంటారు.

sri sathyasai vachanamrutam

**గురుఃబ్రహ్మ గురుఃవిష్ణుః గురుదేవో మహేశ్వరః**
**గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీగురవే నమః**

బ్రహ్మ; అతనే గురువు. ఎవరు యీ బ్రహ్మ? సృష్టికర్త, సమస్తము పాలించేవాడు బ్రహ్మ. సృష్టి తానే, సృష్టికర్త తానే. యీ బృహత్తరమైన జగత్తంతా వ్యాపించి ఉన్నదీ తానే! 'సర్వం బ్రహ్మమయం జగత్.' కనుక యిట్టి సర్వస్వరూపాన్ని ధరించినవాడే నిజమైన గురువు అని స్పష్టమవుతున్నది.

'గురుర్విష్ణుః,' విష్ణువు అనగా ఎవరు? శంఖుచక్రగదాధారి అనా? కాదు, కాదు. 'విష్ణువు' అనగా వ్యాపకమను గుణము కలిగినవాడు. కర్తతానే, కర్మ తానే! జగత్తంతయు క్రియా రూపము. దీనికి భగవంతుడే కర్త. కార్యకర్మలకారణచైతన్యమే భగవత్స్వరూపము. కారణం తానే, కర్త తానే, కర్తవ్యము తానే. అంతా తానే అయినవాడే విష్ణువు. 'విశ్వం విష్ణుస్వరూపం.' విష్ణువు అనగా విశ్వస్వరూపమే! అతనే గురువు.

**అజ్ఞానమనే అంధకారమును నిర్మూలించేవాడే గురువు**

గురువు అనగా ఏమిటి? మంత్రాలు చెప్పి బోధ చేసేవాడా గురువు? కాదు కాదు.

**గుకారో గుణాతీతః రుకారో రూపవర్జితః**
**గుకారో అంధకారస్య రుకారో తన్నివారణః**

గుకారమనగా అజ్ఞానము, అంధకారము. ఈ అజ్ఞానమనే అంధకారమును నిర్మూలము చేసేది ఏమిటి? ప్రకాశమే! కనుక 'గురు' అనగా అజ్ఞానమనే అంధకారమును నిర్మూలము గావించేవాడే! కేవలము మంత్రోపదేశము చేసేవాడే కాదు, గురువు. లేక యింకే విధమైన వేదాంతమును బోధించేవాడు కాదు, గురువు. ఇంకా యీ లౌకికమైన పేర్లతో మనము పిలిచేవారు ఎవరూ గురువు కాదు. వీరంతా అధ్యాపకులు కావచ్చును. ఈ అధ్యాపకులలోపల తాను ఆచరించి యితరులకు బోధించేవాడు 'ఆచార్యుడు' కావచ్చు. 'ఆచార్య' అనగా ఆచరణతో నిరూపణ చేసేవాడు. ఈనాడు ఆచార్యులు లేరు, గురువులు లేరు. 'చెవులో మంత్రం, చేతిలో డబ్బులు;' యిది కాదు, గురువుయొక్క లక్షణము.

sri sathyasai vachanamrutam

'గురుదేవో మహేశ్వరః' మహేశ్వరుడనగా ఎవరు? అనగా ఈ జగత్తునందు సమస్త జీవులను శాసించేవాడు మహేశ్వరుడు. యీ ఈశ్వరుడు ఏమి శాసించాడు? ఎవరు ఏఏ దినములలో, ఏఏ కాలములలో ఎక్కడెక్కడ ఏ విధంగా ప్రవర్తించాలో ఆ ప్రవర్తనకు సరియైన బోధనలు సలిపేటువంటివాడు. ఈ జగత్తును చక్కగా శాసించేటువంటివాడు. సూర్యోదయము, సూర్యాస్తమయము ఒక శాసనమే! ఋతువులు శాసనమే! వర్షము శాసనమే! రాత్రింబవలు శాసనమే! అంతా శాసనమే! కనుక, అన్నింటిని తూచా. తప్పకుండా క్రమశిక్షణను పాటింపచేసేటువంటి శాసనాన్ని జగత్తుకు అందించినవాడు ఈశ్వరుడు. కనుక వీరు ముగ్గురుకూడను గురువులన్నారు.

**భగవంతుడొక్కడే! రూప, నామములు వేరువేరుగా ఉంటున్నాయి**

గురువు అనగా కేవలం విద్యను బోధించేవాడు మాత్రమే కాదు. సర్వశక్తిసంపన్నుడైనవాడు గురువు. సర్వజ్ఞుడైనవాడు గురువు. సర్వవ్యాపకుడైనవాడు గురువు. సమస్తమును తన హస్తమునందు ఉంచుకొని ఉండేవాడు గురువు. విష్ణువు అనగా ఏమిటి? శంఖు, చక్ర, గదా, పద్మములు నాలుగు పట్టుకునే నాలుగు హస్తములు కలిగిన వాడనా? ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఒక చేతిలో గద, యింకొక చేతిలో పద్మము, దీని అంతరార్థము ఏమిటి? శంఖము అనగా శబ్దము. ఇది భగవంతుని చేతిలో ఉంటున్నాది. చక్రము కాల చక్రము. గద అనగా బలము. పద్మము, హృదయ పద్మము. అందరి హృదయములు భగవంతుని చేతిలోనే ఉంటున్నాయి. కాబట్టి యీ విధంగా భగవంతుడు సర్వశక్తులు కలిగినవాడే! విష్ణువు అని శంఖచక్రగదాపద్మములను దృష్టిలో ఉంచుకొని జగత్తునకు బోధిస్తూ వచ్చారు. ఐతే యిక్కడ 'విష్ణువు' అన్నారు; అక్కడ 'ఈశ్వరుడు' అన్నారు. 'ఈశ్వరునికి, విష్ణువుకు యేమాత్రము పొత్తు కుదరదే!' అనుకుంటారు. పొత్తు కుదరకుండా ఉండటానికి వారు యిద్దరు కాదు, వారిద్దరు ఒక్కరే! కొంతమంది శివ, కేశవులను ఆరాధన చేసేవారున్నారు. సంకుచిత బుద్ధులు; వారికి ఒకరితో ఒకరికి పొత్తు కుదరదు. 'నేను వైష్ణవుడను' అని ఒకరు అంటారు. 'నేను శైవుడను' అని ఇంకొకరు అంటారు. ఇదంతా కేవలము సంకుచితమైన భావములే! వీరిలో వీరు

sri sathyasaivachanamrutam

పోట్లాడుకుంటారేగాని, ఉన్నది ఒక్కటే! చూడండి విష్ణువు చేతిలోపల శంఖము, చక్రము, గద, పద్మము ఉంటాయి. అనగా శబ్దము, బలము, కాలము, హృదయము నాలుగు భగవంతుని చేతిలోనే ఉంటున్నాయి. ఈశ్వరుని ఒక చేతిలో ఢమరుకము ఉంటున్నది. యింకొక చేతిలో త్రిశూలము ఉంటున్నది. ఈ ఢమరుకము శబ్దమునకు గుర్తు అనగా శబ్దము భగవంతుని చేతిలో ఉన్నాది. త్రిశూలము త్రికాల స్వరూపము. కాబట్టి కాలము కూడను ఈశ్వరుని చేతిలోనే ఉంటున్నాది. ఈ విధంగా చూస్తే భగవంతుడు ఒక్కడే! రూపనామములు వేరు వేరుగా ఉంటున్నాయి.

**తెలియనంతవరకు నీవు జీవుడే! తెలుసుకుంటే నీవే దైవము!**

లౌకిక దృష్టిలో భారతీయులకు ఉండిన నిత్యానుభవమునకు ఒక చక్కని ఉదాహరణము. వైష్ణవులు తిరుపతికి వెడుతుంటారు. శైవులుకూడా తిరుపతికి పోతుంటారు. కానీ, ఉన్నది వేంకటరమణుడు ఒక్కడే! శైవులు పోయినప్పుడు 'వేంకటేశ్వరా!' అంటారు. వైష్ణవులు పోయినప్పుడు 'వేంకటరమణా!' అంటారు. అక్కడ వేంకటేశ్వర, యిక్కడ వేంకటరమణ; వీరి భావాలు మార్పుగానీ భగవంతుడు ఒక్కడే! 'వేంకటరమణ' అన్నా 'వేంకటేశ్వరా' అన్నా ఒక్కడే! ఇక్కడ భేదభావము చూపించడం కేవలము అల్పబుద్ధులయొక్క ప్రభావము. ఈశ్వరుని 'పశుపతి' అన్నారు. పశుపతి అనగా పశువులకంతా నాథుడు. మనోబుద్ధులతో చేరిన జీవతత్త్వమునకు పశుత్వమని పేరు. అదే వైష్ణవులలో 'గోపాలా' అంటారు. 'గోపాలా,' 'పశుపతి' రెండూ ఒక్కటే! వారు 'గోపాలా' అంటారు, వీరు 'పశుపతి' అంటారు. ఈ విధమైన పేరులు ఏకత్వాన్ని నిరూపణ చేస్తూ వస్తున్నాయి. కానీ, మానవుని అల్పత్వమే యీ భిన్నత్వమునకు మూలకారణమైపోతున్నది. ఎంతకాలము యీ అల్పబుద్ధులతో సాధనలు చేసినప్పటికిని ఉన్నతస్థాయిని మనము యేమాత్రము పొందలేము. అనేకత్వములోని ఏకత్వమును మనము గుర్తించాలి. అదే నిజమైన ఆధ్యాత్మికము. నీవు దైవమే! తెలియనంతవరకు నీవు జీవుడే! తెలుసుకుంటే నీవే దైవము! కనుక ప్రతి తత్త్వము చక్కగా విచారణ సల్పి వివేకముతో మనము ఆలోచన చెయ్యాలి. వివేకమే లేకపోతే సర్వము వ్యర్థమైపోతుంది.

srisathyasaivachanamrutam

## 'ఎంత మాత్రమున ఎవరు తలచిన అంతమాత్రమే నేను'

అనిల్‌కుమార్ టోక్యో, హాంకాంగ్ అన్ని వైపులపోయి అక్కడి వారికున్న భక్తి ప్రపత్తులు, వారికి జరిగిన అనుభూతులు చక్కగా హృదయానందముతో ఇంతసేపు మీకు అందించాడు. అంత దూరములో నున్నవారికే యింత భక్తి ప్రపత్తులు, అనుభూతులున్నప్పుడు మేము దగ్గరనే వుంటున్నామే మాకు ఎందుకు యీ అనుభూతులు రావటం లేదని కొంతమందికి ఉండవచ్చు. మీపైన నిర్దయగానీ, వారిపైన దయగానీ లేవు, నాకు! 'ఎంతమాత్రమున ఎవరు తలచిన అంతమాత్రమే నేను' ఎవరు ఎంత మాత్రం తలుస్తారో అంత మాత్రమే ఉంటుంది. వారి విశ్వాసములే దీనికి మూలకారణము. ఎవరెవరి విశ్వాసము వారికి ఆయా ఫలితములనందిస్తుంది. కానీ మంచి, చెడ్డ అక్కడా ఉంటున్నాది, యిక్కడా ఉంటున్నాది. కానీ వారు దూరముగా ఉండటంచేత వారి భక్తి, ప్రపత్తులు గాఢముగా చేరిపోతున్నాయి. గాఢముగా చేరిన భావములు ఎలాంటి పరిస్థితిలో కూడా సుక్షేమముగానే ఉంటాయి. గాఢముగా చేరని భక్తులు ఎప్పుడు అశాంతిగానే ఉంటారు. ఒక చిన్న ఉదాహరణము. రోడ్డుకు ప్రక్కలోపల పెద్ద పెద్ద వృక్షాలంతా ఉంటుంటాయి. యీ వృక్షములు చాలా పెద్దగా ఉంటున్నాయి. కానీ క్షామము ఏర్పడింది. వర్షము లేదు, నీరు లేదు. కానీ ఆ వృక్షములు పచ్చగనే ఉంటున్నాయి. దానికి ప్రక్కనే వరి పంట ఉంటున్నాది. దానికి నిత్యము నీరు పెట్టాలి. ఒక్క దినమైనా నీరు పెట్టకపోతే వాడి పోతుంది, ఎండి పోతుంది. ఈ తెలివితక్కువ మనిషి ఏమనుకున్నాడు? 'ఒరే యింత చిన్నమొక్క ఒక్క రోజు నీరు లేకపోతే వాడిపోయి చచ్చిపోతున్నాది. ఇంత పెద్ద వృక్షము యింత కాలము వర్షము లేకపోయినా కళకళలాడుతున్నది' అని. దీనికి కారణం ఏమిటి? ఆ పెద్ద చెట్టుయొక్క వేర్లు నీటి మట్టమువరకు చేరిపోయాయి. కనుక లోపలనుంచి నీటిని వేర్లద్వారా సప్లైచేస్తున్నది. ప్రక్కనున్న వరిపైరు నీటి మట్టమువరకు పోలేదు. పైపైననే ఉంటున్నాయి. పైపైన నీరు ఉన్నంతవరకు పచ్చగా ఉంటుంది. పైపైన నీరు లేకపోతే ఎండిపోతుంది. కాబట్టి అన్ని విధముల మనము అశాంతికి, దుఃఖమునకు గురి కావటానికి కారణం ఏమిటి? మన భావములు ఆ అనుగ్రహము, ఆనందము, ప్రేమ అనే తత్త్వముయొక్క లోతువరకు దిగటం లేదు. కేవలం పైపైననే మనం ప్రయాణము చేస్తున్నాము. అంతా మనం flying saucers

మాదిరి తయారైపోయినాము. యిట్టి దానిలో మనము భగవత్తత్త్వాన్ని గుర్తించుకోలేము. ఆ నమ్మకము మనకు కుదరాలి. ఆ విశ్వాసమే మన నిజమైన శ్వాస. కానీ ఆ శ్వాస మధ్య మధ్య మారుతుండటంచేత, వ్యక్తిగతమైన అభిప్రాయభేదములచేత మానవుడు అనేక విధములైన దుఃఖములకు, విచారములకు, అసంతృప్తికి గురౌతున్నాడు.

## విశ్వాసమునకు ఎన్నటికి ఓటమి అనేది లేదు

మనం వింటున్నాం, ఎన్నో మాటలు. స్వామి మాటలు నిత్యము వింటూనే ఉంటున్నారు. కానీ కొంతమంది ఒక్కతూరి వింటే చాలు దానిని జీవితమంతా ఆచరణలో పెడుతూ ఉంటారు. యింత ఉపన్యాసము చేసిన అనిల్‌కుమార్‌కూడను యిక్కడ యిండియాలో బెంగుళూరులో, గుంటూరులో ఉన్నంతవరకు మంచిగా ఉపన్యాసాలు యిస్తాడు. ఉపన్యాసము కళగా, ఆకర్షణీయంగా, శోభాయమానంగా ఉంటున్నాది. కానీ మధ్య మధ్య యీ monkey mind bumps & jumps చేస్తుంటాది. ఒక్కొక్కతూరి తానే చెప్తుతుంటాడు. 'యిది నిజమా' అని సందేహపడుతుంటాడు. ఈ సందేహమును పరిహారము గావించే నిమిత్తమై నేను అతనిని టోక్యో పంపించాను. అక్కడకు పోయి వారి భక్తి ప్రపత్తులంతా కండ్లారా చూచాడు. దీనికంతా మూలకారణము మన విశ్వాసమే అని దృఢముగా తెలుసుకున్నాడు. కనుక ఎక్కడైన సరే విశ్వాసమనేది ఎప్పటికి ఓడిపోదు. ఆ విశ్వాసము ఏమైనా తగ్గినప్పుడే అన్నీ తొందరలే కలుగుతుంటాయి. ప్రహ్లాదుడు హరి ప్రియుడు. హిరణ్యకశిపుడు హరి ద్వేషి. హరి లేడు, లేడు అని ఒకే వాదన చేస్తున్నాడు హిరణ్యకశిపుడు. ఉన్నాడు, ఉన్నాడు అని ఒకే విశ్వాసమును అనుభవిస్తున్నాడు ప్రహ్లాదుడు. కొండలపైనుండి నెట్టినప్పుడు ఎవరు కాపాడారు? ఆ విశ్వాసమే కాపాడింది, విష్ణువు కాదు. ఆ విశ్వాసమే విష్ణుస్వరూపాన్ని ధరించింది. కనుక భగవంతుని అనుగ్రహము ఏఏ సమయములోపల ఏఏ రూపములలో ఎక్కడెక్కడ ఎట్లా వస్తుందో ఎవరికి తెలియదు.

## భగవంతుడు ఏ రూపములోనైనా రావచ్చును

ఒకానొక సమయములోపల షిరిడీలో తాత్యా భార్య సాయిబాబాకు వంట చేసి పెట్టాలని చాలా ఆశ పడింది. 'మా యింటికి రావాలి స్వామీ! నేను ఒక వ్రతము చేసుకుంటున్నాను.

sri sathyasai vachanamrutam

మా యింటిలో భోజనము చేయాల'ని ఆశించింది. 'తప్పక వస్తాన'ని మాట యిచ్చాడు, బాబా. ఆమె పదార్థములన్నీ సిద్ధము చేసుకుంది. అన్ని విధాల కాచుకుంది, పాపం! కాని చెప్పిన కాలమునకు పోలేదు బాబా! అన్నీ తట్టలో పెట్టుకుంది. దగ్గరకు పోయి 'ఎందుకు బాబా నన్ను యింత అవమానము చేస్తున్నావు? నాకు అవమానము అయినా పరవాలేదు. మీరు యిచ్చిన మాటను తప్పి పోతున్నారు. అసత్యవాది అని పేరు వస్తుంది. మీరు అసత్యమునకు పాల్పడకూడదు. చెప్పిన మాట నిలబెట్టు కోవాలి' అని బాబా పటముముందు పోయి ప్రార్థిస్తున్నాది. యీ లోపల ఒక కుక్క వచ్చింది. ఆ చేసిన వంటనంతా తిని వెళ్ళిపోయింది. చూచేటప్పటికి కుక్క తింటూవున్నది. కట్టె తీసుకొని దాన్ని బాగా తరిమికొట్టింది. అప్పుడు ఆమె 'ఛీ! నేను చేసినదంతా కుక్కకు అర్పితము అయిపోయింది, నా దైవానికి కాదే! దైవముకొరకు చేసినది కుక్కకు అర్పితము అయిపోయింది. ఎంత దురదృష్టవంతురాలను' అని బాధపడింది, పాపం! రెండవదినము బాబావద్దకు వెళ్లి 'బాబా! మీరు చెప్పిన మాటను దక్కించుకోవాలి కదా! మీరు చెప్పిన మాట ప్రకారము నడచుకోవాలి కదా! ఎందుకు అబద్ధం చెప్పారు?' అని అడిగింది. బాబాకు కోపం వచ్చి 'సైతాన్! నేను అబద్ధం చెప్పానా! (అక్కడ ప్రతి దానికి 'సైతాన్', 'సైతాన్' అని ఉపయోగపెట్టేది. యిప్పుడు ఎక్కువగా 'దున్నపోతా!' 'దున్నపోతా!' అని ఉపయోగపెట్టేది.) నేను అబద్ధం చెప్పవలసిన అవసరము లేదు. నీ తృప్తికోసమై నేను అబద్ధమాడనక్కర లేదు. నేను సత్యస్వరూపుడను. నా సత్యమును మీరు గుర్తించుకోటం లేదు. సాయిబాబా అంటే యీ 5 1/2 అడుగుల రూపాన్ని మాత్రమే మీరు సంకుచితమైన భావములో చింతిస్తున్నారు. అన్ని రూపములు నావే! అనంతమైన భావము మీలో లేదు. మీది సంకుచిత భావము. దానివల్ల మీకు భేదము కనుపిస్తున్నాది. ఆ కుక్క ఎవరు? నేనే' అని బోధపర్చాడు. సర్వస్వరూపములు తానుగా భావింపచేసే తత్వము దైవముది. కానీ ఒక్క రూపముపై లక్ష్యము పెట్టుకొని, దీనిని మాత్రమే మాటలక్రిందను, ఆటలక్రిందను, పాటలక్రిందను భావించుకొని దానిలో జరిగిన మార్పులవల్ల దైవముపైన మార్పు రావటము యిది కేవలము ఒక సంకుచితమైన భావమే! భగవంతుడు ఏ రూపములోనైనా రావచ్చును. అన్ని రూపములు తానే!

**భగవంతుని సంకల్పముచేతనే సర్వము జరిగిపోతుంటాయి**

స్వామి యిప్పుడు అనిల్‌కుమార్‌ని పిల్చి ఒకటి చెప్పవచ్చు. యింకో పిల్లవానికి యింకొకటి చెప్పవచ్చు. లేదా ఏ పిల్లవానితోనైనా యీ వార్తను నేను పంపవచ్చును. ఒకరు పాము కరచి చచ్చిపోతాడు. ఒకరు పిడుగు పడి చచ్చిపోతాడు. ఒకడు జారిపడి చచ్చిపోతాడు. యివన్నీ జరుగుతున్నాయంటే ఏమిటి అర్థం? యీ సమయంలో భగవంతుడు నన్ను రక్షించలేదంటే ఆ పాము తాను పంపిందే, ఆ పిడుగు తాను పంపిందే; భగవంతుని సంకల్పముచేతనే సర్వము జరిగిపోతుంటాయి. యిప్పుడు ఒక చిన్న ఉదాహరణము. యిక్కడ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కట్టాము. యిది ఎందుకోసము కట్టాలి? అనేకమంది అనేక రోగములతో బాధ పడుతుంటారు. అందరికి దివ్యమైన భక్తి, ప్రపత్తులు రావాలంటే చాలా కష్టము. కొంతమందికి మందులపైన విశ్వాసము, కొంతమందికి ఆపరేషన్‌పైన విశ్వాసము, కొంతమందికి డాక్టర్సుపైన విశ్వాసము. యీ విధముగా అనేక రకాలుగా ఉంటుంది. ఏ రకమైతేనేమి? 'చావడి అయితేనేమి, సత్రము అయితేనేమి, నిద్రవస్తే చాలురా?' అని. అదేవిధముగా ప్రజలందరు రోగము నివారణయై ఆరోగ్యము కాపాడుకొని ఆనందముగా ఉండటమే నాయొక్క లక్ష్యము. దానివల్ల చాలామంది శ్రద్ధాభక్తులతో కూడినవారు, మన వేణుగోపాల్, ఢిల్లి టీమ్ యింకా హైదరాబాద్ టీమ్ వీరందరు వచ్చి ఇక్కడ ఆపరేషనులు చక్కగా చేస్తున్నారు. అంతదూరమునుండి వేణుగోపాల్, ఢిల్లి టీమ్ వచ్చి ఆపరేషన్ చేయటానికి ఏది కారణము? స్వామియందు వారికి గల శ్రద్ధాభక్తులే దీనికి మూలకారణము. లేకపోతే ఢిల్లి వదలి వచ్చి రాత్రింబవలు ఈ మారుమూలగ్రామములో అంత శ్రమ పడవలసిన అవసరము ఏమి వచ్చింది? స్వామి ఆసుపత్రిలోపల అందరికి ఆపరేషన్ జరిగి అందరికీ ఆనందము యివ్వాలనే వారి సత్సంకల్పము. వారుకూడను స్వామి లక్ష్యముతోనే చేస్తున్నారు, కాని వేరొక లక్ష్యము కాదు. ఒక్కొక్కరిద్వారా ఒక్కొక్క పనిని చేయించాలి. మొత్తముపైన వీటన్నిటికి ఒకే గమ్యమే, ఒకే లక్ష్యమే!

**విజయానికిగాని, అపజయానికిగాని విశ్వాసము లేక అవిశ్వాసమే మూలకారణము**

పూర్వము గుండె ఆపరేషన్ అంటే ఎంతో భయపడిపోయేవారు. బంధువులనంతా

పిలిపించుకునేవారు. ఈ ఆపరేషన్ తరువాత యేమవుతుందో ఏమిటో వీరికి అని ఏడ్చుటము, వచ్చిన బంధువులను యేడ్పించటమే! ఈ రకంగా జరుగుతూ ఉండేది. యిప్పుడు ప్రశాంతినిలయములోపల గుండె ఆపరేషన్ పెట్టిన తరువాత అందరికి కాలులో విరిగిన ముల్లు తీసినట్లుగా సులభమైపోయింది. వారికి గుండె ఆపరేషన్ అంటే భయమే లేదు! ఆ నిర్భయమే అభయము! చిన్న చిన్న పిల్లలంతాకూడను నవ్వుతూ నవ్వుతూ వస్తున్నారు ఆసుపత్రికి. నేను నిన్న ఆసుపత్రికి వెళ్ళాను. ఒక చిన్న బిడ్డకు ఆపరేషన్ జరిగింది. ఆ మంచంపైనుండి నవ్వుతూ నవ్వుతూ స్వామికి నమస్కారం చేస్తున్నాది. తల్లి లేదు, తండ్రి లేదు, బంధువులు లేరు దగ్గర. ఆ బిడ్డకు అంత ఆనందము ఎక్కడనుంచి వచ్చింది? అది కేవలము వాతావరణముయొక్క ప్రభావము. వారి విశ్వాసమే దీనికి మూలకారణము. అన్ని విధముల ఆనందముగా జరుగుతున్నాయి. యివన్నీ వారు ఒక భగవత్కార్యముగా చేస్తున్నారు. ఈ ఆపరేషన్లు మేము చేస్తున్నామనే అహంకారము వారి దగ్గర ఎక్కడా లేదు. వారెదురుగా చెప్పకూడదుగానీ ఎంతో శ్రద్ధాభక్తులతో చేస్తున్నారు. అలాంటి శ్రద్ధాభక్తులు కలిగినవారే యీనాటి లోకమునకు అవసరము. శ్రద్ధాభక్తులులేక ఎన్ని చేసి ఏమి ప్రయోజనము? మంచి తాజా కూరగాయలు మార్కెట్టునుండి తెచ్చాము. అప్పటికప్పుడు చింత చెట్టునుండి క్రొత్త చింతపండు తీశాము. ఉప్పు వేశాము. మంచి మిరపకాయలు వేశాము. చక్కని సాంబారు చేశాము. కాని, అది చెడిపోయింది. ఉప్పులో తప్పుందా? పప్పులో తప్పుందా? లేక చింతపండులో తప్పుందా? కూరగాయలలో తప్పుందా? కాదు కాదు. పాత్రలో కళాయి వేయలేదు. అందువలన పాడై పోయింది. అలాగే యీ ఆపరేషన్‌లు ఎన్ని చేసినా, లక్షల రూపాయలు ఖర్చుచేసి గుండెలో వాల్వ్‌లు పెట్టినప్పటికిని అన్నీ చేస్తున్నప్పటికి భక్తి, విశ్వాసమనే ప్రేమతత్త్వము లేకపోతే కళాయిలేని పాత్రలో వండిన సాంబారువలె అవుతుంది. కనుక విశ్వాసము కావాలి. ఎక్కడైనా విజయానికిగానీ, అపజయానికిగానీ విశ్వాసము లేక అవిశ్వాసమే మూలకారణము. విశ్వాసము ఉన్నచోట అన్నీ జరుగుతాయి. విశ్వాసము లేకుండా భక్తి, భక్తి అని వాదోపవాదములు చేస్తూ కూర్చుంటే యిది అహంకారముయొక్క ప్రభావాలు, ఆడంబరాలయొక్క ప్రభావాలు. అంతేగాని భక్తి, ప్రపత్తులయొక్క ప్రభావము కాదు.

**దైవత్వము లేని స్థానముగాని, వస్తువుగాని జగత్తులో లేదు**

ప్రేమస్వరూపులారా! దైవత్వముయొక్క తత్త్వము గుర్తించాలంటే మొట్టమొదట దైవత్వము సర్వత్రా ఉంటున్నాదని గ్రహించాలి. దైవత్వము లేని స్థానముగానీ, వస్తువుగానీ జగత్తులో లేదు, లేదు. 'గురుపూర్ణిమ' అనగా పూర్ణమైన చంద్రుడు. ఎట్టి మచ్చలు లేని చంద్రుడు. 'చంద్రమా మనసో జాతః చక్షో స్సూర్యో అజాయత.' చంద్రుడనగా మనయొక్క మనసే! యీ మనస్సు పరిపూర్ణమైనదిగా ఉండినప్పుడు అదే గురుపూర్ణిమ. మంచి ప్రకాశాన్ని యిస్తుంది. అదే గురుపూర్ణిమయొక్క ప్రభావముగానీ శిష్యులందరిని చేర్చుకొని పాదపూజలు చేయించుకోటం, యివి కాదు గురుపూర్ణిమయొక్క లక్షణాలు. ఎంత ప్రదక్షిణ చేసినా, దక్షిణ లేక ఫలితము లేదంటారు. కాబట్టి దక్షిణ, ప్రదక్షిణ. దక్షిణ ఏమిటిది? నీ ప్రేమను అందించటమే దక్షిణ. ప్రదక్షిణ అనగా ఏమిటి? సర్వత్ర ఉండినది భగవంతుడు ఒక్కడే అని తెలుసుకోటమే ప్రదక్షిణ. ఈ రెండు తత్త్వాలను మనం చక్కగా గుర్తించుకుంటే నిత్యము గురుపూర్ణిమే! సర్వము గురుత్వమే! 'మర్మమెరిగిన మరు నిమిషములో మనసే వారికి గురుడండి'. మర్మము తెలియకుండా ఉండినంతవరకు అంధకారమే! సత్యాన్ని గుర్తించుకుంటే అదే గురుత్వము. కాబట్టి గురువు అనగా ఒక్క దైవమే గురువు, దైవమే గురువు. యింకెవరూ గురువులు లేరు, లోకములో! దైవచింతన చేయండి.

**సమీపమందున్న దాని విలువ అంత తొందరగా గుర్తించటానికి వీలుకాదు**

ప్రేమస్వరూపులారా! భారతదేశమందు అనేక విధములైన అనుభవజ్ఞులైన వైద్యులు లేకపోలేదు. విదేశములకు పోయి వారు అనేక విధములైన శ్రమలు చేసి చాలా నూతనమైన పద్ధతులను గుర్తించి, అనేక విధములుగా పేరు ప్రఖ్యాతులు పొందుతున్నారు. నిజముగా భారతీయులకున్నంత ఓపిక మరొకరికి లేదు. విదేశములకు పోయి రాత్రింబవలు కష్టపడి రోగులను చూస్తూ ఎన్నో విధములైన శ్రమలు పడుతున్నారు. అక్కడకూడను అధికంగా రోగులకు వైద్యము చేసేది భారతీయులేగానీ, విదేశీయులు ఎక్కువ మంది కారు! పూర్వము మన భారతదేశములో (ఆంధ్రప్రదేశములో ప్రత్యేకముగా) 'సొమ్ములు మావి, సోకులు మీవి' అని చెప్పేవారు. పని చేసేది అంతా భారతీయులే, అక్కడ. కాని, కీర్తి ప్రతిష్ఠలంతా వారికి! భారతదేశములో ఎంతో శక్తిసామర్థ్యములు గలవారు ఎందరో ఉంటున్నారు. ఏదైనా

srisathyasaivachanamrutam

సమీపములో ఉన్నదాని విలువ అందరికి అంత బిఱ్ఱున గుర్తించటానికి వీలు కాదు. దూరంగా ఉన్న దానిపైనే ఆకర్షణ. 24 గంటలు స్వామిచెంతనే వుండికూడను స్వామి విలువ చాలామందికి అంతగా తెలియదు. కొంచెము దూరము పోయినప్పుడే విలువ ఎక్కువగా తెలుస్తుంది. లైట్ హౌస్ ఉంటుండాది. దాని కాంతి చాలా దూరములో ఉండినవారికేగానీ, క్రిందనున్నవారికి క్రీ నీడనే! అదే విధముగనే మన భారతీయులలోపల శ్రద్ధ, భక్తి కలిగినవారు ఎందరో ఉన్నారు. విదేశీయులలోకూడ మంచివారు లేకపోలేదు. భారతదేశములో యింత శక్తి, సామర్థ్యములు గలవారు ఉండినప్పటికిని వారికి తగిన ఉత్సాహప్రోత్సాహములు అందించేవారు చాలా తక్కువ. కనుకనే మన భారతదేశములో చాలామంది డాక్టర్లు, నర్సులు, కంపౌండర్లు యిలాంటివారు విదేశాలకు వెళ్ళిపోతున్నారు. కారణము ఏమిటి? వారికి తగిన అవకాశములు యిక్కడ యివ్వటంలేదు. అంతేకాక వారికి తగిన ఉద్యోగములు యివ్వటం లేదు. వారి స్థాయికి తగిన అవకాశములు అందించటం లేదు. సీనియర్ జూనియర్‌గా, జూనియర్ సీనియర్‌గా మార్చేస్తుంటారు. యిలాంటి కొన్ని యిబ్బందులవలన భారతదేశమునుండి అనేకమంది బయటకు వెళ్ళిపోతున్నారు. కానీ, నా ఉద్దేశ్యము ఏమంటే శక్తి సామర్థ్యములు కలిగినవారిని భారతదేశమునుండి బయటకు ఎందుకు పంపాలి? మనమే వీరిని యిక్కడ పెట్టుకొని వారితోనే యీ పని చేయించుకోటం చాలా బాగుంటాది.

**దేశముయొక్క క్షేమమే మన క్షేమము**

చాలా గొప్ప గొప్ప డాక్టర్లు అంతా ఉంటున్నారు, మన ఆసుపత్రిలో. చూడటానికి ఆకారంలో చాలా చిన్నగా ఉన్నప్పటికిని మా వేణుగోపాల్ శక్తిసామర్థ్యములు ఎవరూ సరిగా అర్థం చేసుకోటం లేదు. బాలదాస్ అని ఇంకొక డాక్టరు ఉంటున్నాడు. చిన్నగా ఉంటాడు. రాత్రింబవలు పని చేస్తుంటాడు, పాపం! యిది రాత్రీ, పగలు అని వ్యత్యాసమే లేదు. వారు భోజనం సాయంత్రం 5 గం॥లకు తీసుకుంటారు. అదికూడా నా మనసుకు కష్టమే! డాక్టర్లు బాగుంటేకదా, మనం వారిచేత పనులు బాగా జరుపుకోవచ్చు! Health & wealth అన్నారు. వారు బాగుండినప్పుడే ఎన్ని పనులైనా చేయించుకోవచ్చును.

srisathyasaivachanamrutam

అందువలనే నేను చెబుతున్నాను, 'దినము 10, 12 చేస్తున్నారు, ఆపరేషన్లు. వద్దు, వద్దు; 3, 4 చేయండి చాలు. మీరుకూడా ఆరోగ్యంగా ఉండాలి. మీకు అధికంగా శ్రమ అయితే, మాకు చాలా యిబ్బంది అయిపోతుంది.' అలాంటి గొప్ప డాక్టర్లు ఉండినప్పుడు వారికి తోడుగా మంచి నర్సులు కూడా లభ్యమయ్యేటట్లు ట్రైనింగ్ చేయాలనేటువంటి సంకల్పము చేసి, రేపటినుండి ఒక నర్సు ట్రైనింగ్ కాలేజి పెట్టేస్తున్నాను. డాక్టర్లు ఆపరేషను చేయటం సులభం. కాని, ఆపరేషను అయిన తరువాత వారిని చూచుకునేదే యిబ్బంది. కూరగాయలు కోయడం చాలా సులభం. కానీ మంచి కూరగా వండటమే కష్టము. ఈ వంట నర్సుపైన ఆధారపడి ఉంటుంటాది. ఈ నర్సు సరైన రీతిగా లేకపోతే ఆపరేషన్ బాగా చేసినా అది అపజయమే అవుతుంది. మంచి నర్సులను ట్రైనింగ్ చెయ్యాలని నర్సు కాలేజీ రేపటినుండి ఆరంభం చేస్తున్నాం. ఎవరైనా మంచి త్యాగజీవులు, పవిత్రమైన హృదయంతో సేవ చేయాలనే ఉద్దేశ్యము వున్నటువంటివారు మా సఫాయా దగ్గరకు వచ్చి దరఖాస్తు యిచ్చుకొని అందులో చేరితే ఏ విధమైన ఖర్చులేదు, ఉచితంగా చదువుకోవచ్చు! యింకొక చోట నర్సు కాలేజీలో అయితే వారికి ట్యూషన్ ఫీజు కట్టాలి, యింకేవేవో ఫీజులు కట్టాలి. యిక్కడ ఎటువంటి ఫీజు లేదు. భోజనంకూడా ఉచితంగా పెట్టాము. ఎవరైనా మంచి హృదయము కలిగినవారు కావాలి. యిప్పుడు మా ఆసుపత్రిలో కావలసినంతమంది ఉంటున్నారు. ఎంతమంది ఉండినప్పటికిని సరిపోవటం లేదు. ఎందుకంటే, రోగులు ఎక్కువగా ఉన్నారు. కనుక యింకా ఎక్కువమంది కావాలి, నర్సులు. కేవలము మా నిమిత్తము మేము కోరటం లేదు, దేశము నిమిత్తము. దేశముయొక్క క్షేమమే మన క్షేమము. 'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అని మన జన్మనిచ్చిన తల్లి, జన్మించిన దేశము, రెండు స్వర్గము కంటె మించినవి. కనుక మన దేశములోపల యిలాంటి పవిత్రమైనవి వ్యాప్తిగావించాలి. ఏ మూలనో పల్లెల్లో, కుగ్రామములలో ఉండినవారికి యిలాంటి అవకాశము అందించటము చాలా కష్టము.

**మాకు ఆచరణ ప్రధానముకాని, ప్రచారము కాదు!**

యీనాడు యీ పల్లెలో ఇంత విశాలమైన ఆసుపత్రి ప్రారంభము కావటంచేత

ఎంతమందికో ఎన్నో ఉపకారములు జరుగుతున్నాయి. చాలామందికి తెలియదు, దీని రహస్యము. కేవలము ప్రచారము చేసుకోటానికి మేము దీనిని ప్రారంభించ లేదు. మాకు ఆచరణ ప్రధానము కానీ, ప్రచారము కాదు. గుండె ఆపరేషను జరిగితే కనీసం ఒక్కనెలైనా ఆసుపత్రిలో ఉండాలి. కాని మా ఆసుపత్రిలోపల, అతిశయోక్తిగా చెప్పుకోటం కాదు, ఈనాడు ఆపరేషన్ అయితే రేపటి దినము లేచి కూర్చుని యిడ్లీలు తింటూ ఉంటారు. మూడవదినము నడుస్తున్నారు. 5వదినము కుట్లు విప్పేస్తున్నారు. 7వదినము విడుదలై ఇంటికి వెళుతున్నారు. ఎట్లాగో తెలుసునా? కొత్త పెండ్లి కొడుకులు, పెండ్లి కూతురు మాదిరి ఉంటున్నారు. మా పిల్లలకు బాగా తెలుసు. రాధాస్వామి అని ప్రొఫెసరు ఒకరున్నారు. ఆయనకూడా ఉన్నాడు యిక్కడే! ఆయనకు గుండె ట్రబుల్ ఉందనే తెలియదు, పాపం! ఎట్లా పనిచేశాడో ఏమిటో? మా వేణుగోపాల్ తక్షణమే పట్టేశాడు. 'తక్షణమే ఆపరేషన్ చేయాలి, ప్రమాదస్థితిలో ఉంది,' అన్నాడు. ఆపరేషన్‌లో నాలుగు బైపాస్‌లు చేశారు. 'యిప్పుడు పెండ్లి చేస్తే ఆయన రెడీ!' అట్లా ఉంటున్నాడు, యింత గట్టిగా! అదే ఆనందము. యీ ఆరోగ్యమే మహాభాగ్యము. ఆరోగ్యము బాగుంటే ఎన్ని కార్యములైనా చేయవచ్చును. అలాంటివారే ఎంతోమంది ఇక్కడ చికిత్స పొంది పుష్టిగా ఆరోగ్యమును అనుభవిస్తున్నారు. యిది క్రమక్రమేణా, నేడు కాదు రేపు కాదు, యావత్ ప్రపంచానికి ఆదర్శముగా అవుతుంది. ఎవరైనా, ఏవిధమైన శక్తిసామర్థ్యములు లేనివారైనా సరే, ఇక్కడికి రావడానికి ఏ విధమైన జంకుబొంకు ఉండకూడదు. యిది మీ ఆసుపత్రి, నాది కాదు! మీ నిమిత్తమై పెట్టినదే యిది. ఎవరైనా ఇక్కడకు వచ్చి ఆనందంగా ఆరోగ్యం బాగు చేసుకొని, సుఖశాంతులను అనుభవించుకొని ఇతరులకు ఆదర్శవంతమైన జీవితమును అందిస్తారని ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను. కొంతమంది అనుకుంటున్నారు, దీనిని కేవలం బీదవారికోసమే పెట్టారేమో మా బోటివారు పోకూడదేమోనని సందేహిస్తున్నారు. కాదు, కాదు. అందరికి ఇది సేవలందించే ఆసుపత్రి. వీడు శ్రీమంతుడు, వీడు దరిద్రుడు అని రోగము కనుక్కొని రాదు. ఎవరికైనా రావచ్చును. కాబట్టి ఎవరైనా రావచ్చును, యిక్కడకు. ఆ భేదము మా దగ్గర లేదు. కోటీశ్వరుని మొదలుకొని కూటిపేదవరకు ఇక్కడ సమానమే! కనుక, మీరే మాత్రము సందేహము పెట్టుకోకుండా

sri sathyasai vahini amrutam

అవసరములో ఉన్న అందరు ఆసుపత్రికి రండి. చికిత్సలు ఉచితంగా పొందండి. మీకు యీ విధమైన స్వాతంత్రము ఉంటున్నది.

**(తేదీ 14-07-1992న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam